## క్లుప్తంగా

### స్టేషన్ రోడ్డులో మార్కింగ్

**ఫిరంగిపురం:** మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో తమ స్థలానికి ఎదురుగా ఉన్న గృహాలను తొలగించాలని స్పందనలో స్థల యజమాని బి.అంజిరెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై స్టేషన్‌రోడ్డులోని గృహ యజమానులకు పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఓ గృహ యజమాని పి.జోజి హైకోర్టును ఆశ్రయించాడు. దీనిపై కోర్టు మండల సర్వేయర్‌చే రోడ్డు మార్జిన్‌ను మార్కు చేయించాలని ఆదేశించడంతో మంగళవారం మండల సర్వేయర్ వెంకటేశ్వరరావు, ఈఓ శ్రీనివాసరావులు సిబ్బందితో స్టేషన్ రోడ్డుకు ఇరువైపులా మార్జిన్‌లు కొలతలు వేయించారు. దీనిని త్వరలో కోర్టులో అందజేస్తామని ఈఓ శ్రీనివాసరావు తెలిపారు.

### 5న హుండీ లెక్కింపు

**తాడేపల్లిరూరల్:** దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసియున్న మహంకాళీ అమ్మవారి దేవస్థానం హుండీ లెక్కింపు జూన్ 5వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చిన వెంకటరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు జూన్ 5వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని, ఆసక్తి గల భక్తులు హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చని కోరారు.

### ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**ఫిరంగిపురం:** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మేడికొండూరు, ఫిరంగిపురం మండలాల ఉద్యోగుల సంఘ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల కోసం నాలుగేళ్లపాటు ఎదురుచూశామన్నారు. ఇప్పటివరకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో తప్పని పరిస్థితిల్లో ఉద్యమాలకు సిద్ధమవుతున్నామన్నారు. సమావేశంలో తాలూకా యూనిట్ ప్రెసిడెంట్ టి.రాజాబాబు, వైస్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్, సెక్రటరీ షేక్ అలి, ట్రెజరర్ టి.లూర్దురాజు, టి.హేమలతాభాస్కర్, పి.శౌరిజోజి, పి.శారద, కె.మోహన్‌బాబు, జి.అరుణభారతి, జీవి.సూర్యనారాయణ, ప్రకాష్, డి.నవీన్ సాయికుమార్, రాష్ట్ర టైంస్కేల్ ఆర్‌డబ్ల్యూఎస్ నాయకుడు సాయి తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత కంప్యూటర్ శిక్షణ

**నెహ్రూనగర్:** ప్రధాన మంత్రి కౌశల్ కేంద్ర, సింక్రోసర్వ్ గ్లోబల్ సొల్యూషన్స్ సంయుక్త ఆధర్యంలో యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు సింక్రోసర్వ్ సెంటర్ హెడ్ ఎన్. కిశోర్‌బాబు తెలిపారు. బ్రాడీపేటలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా కనీస విద్యార్హతతో ఎంఎస్ ఆఫీస్, ట్యాలీ, కంప్యూటర్ హార్డ్‌వేర్, సోలార్ టెక్నీషియన్‌తో పాటు టైలరింగ్ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొనారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కూడా కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు బ్రాడీపేట 4/15, సింక్రోసర్వ్ గ్లోబల్ సొల్యూషన్స్‌లో లేదా 9390713161, 9100064573 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. జూన్ 1 నుంచి కొత్త బ్యాచ్ ప్రారంభమవుతుందని తెలియజేశారు.

### 38 వాహనాలపై కేసులు

**పట్నంబజారు:** కాలుష్య ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని డీటీసీ షేక్ కరీం స్పష్టం చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం వాహనాలకు కాలుష్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ మిషన్ లైఫ్‌లో భాగంగా కాలుష్య నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. పొల్యూషన్ సర్టిఫికెట్ లేకుండా నడుపుతున్న 38 వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీలు జిల్లా వ్యాప్తంగా జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో ఎంవీఐ గోపాల్, అధికారులు పాల్గొన్నారు.

### ఇరువర్గాల మధ్య ఘర్షణ

**గుంటూరు ఈస్ట్:** భార్యాభర్తల మధ్య గొడవ నేపథ్యంలో ఇరువర్గాలు పరస్పర దాడులు చేసుకున్న ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. బెజవాడ సుకన్యకు, కొర్నేలుకు 12 సంవత్సరాల కిందట వివాహమైంది. ఇద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడడంతో సుకన్య తుఫాన్‌నగర్‌లోని పుట్టింటికి వచ్చింది. భార్యాభర్తలు ఫోన్‌లో గొడవ పడ్డారు. ఈ నేపథ్యంలో మంగళవారం కొర్నేలు, అతని తల్లిదండ్రులు సుకన్య నివాసానికి వెళ్లారు. ఈ సమయంలో రెండు కుటుంబాలు పరస్పరం గొడవపడి దాడి చేసుకున్నారు. పరస్పర ఫిర్యాదులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

### మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

**గుంటూరు ఈస్ట్:** మద్యం మత్తులో ఓ వ్యక్తి ఇంట్లోకి జొరబడి మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వెంగళరావునగర్‌లో నివసించే ఓ కుటుంబం సోమవారం రాత్రి వేసవి కాలం కారణంగా ఇంటి తలుపులు దగ్గరకు వేసి నిద్రించింది. మద్యం మత్తులో తెల్లవారుజామున కొక్కిలిగడ్డ అంకమ్మరావు ఇంట్లోకి జొరబడి ఓ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆమె కేకలు వేసింది. దీంతో భర్త, స్థానికులతో కలసి అంకమ్మరావుకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సంక్షేమ సారథులు వలంటీర్లు

**సేవా పురస్కారాలు అందజేసిన ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు**



సేవా వజ్ర కర్రి వెంకటరమణను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవిలు

**మంగళగిరి:** ప్రభుత్వానికి, ప్రజలకు సంక్షేమ సారథులు వలంటీర్లు అని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అన్నారు. మంగళవారం నగరంలోని ఈద్గా మైదానంలో వలంటీర్లకు సేవా పుస్కారాలను అందజేశారు. సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్రలకు పురస్కారాలు అందజేశారు. ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమం అందించడం వలంటీర్ వ్యవస్థతోనే సాధ్యమైందని, దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ క్యాలెండర్ అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఎటువంటి రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా పేదలకు అందుతున్నాయన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో సంక్షేమ పథకాలు అందాలంటే ప్రజలను దోచుకున్నాయన్నారు. సంక్షేమ పథకాలను అందించడంలో గత ప్రభుత్వానికి ఇప్పటి ప్రభుత్వానికి తేడా ప్రజలు గ్రహించాలని కోరారు. అనంతరం సేవా వజ్ర పురస్కానికి ఎంపికైన నిడమర్రు రెండో వార్డు సచివాలయ వలంటీర్ కర్రి వెంకటరమణను సత్కరించి నగదు పురస్కారాన్ని అందజేయడంతోపాటు సేవా రత్న, సేవామిత్రలుగా ఎంపికైన వలంటీర్లను సత్కరించి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, నగర కమిషనర్ యు శారదాదేవి, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరాజు, డీఈ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, నాయకులు ఎండీ ఫిరోజ్, హన్సన్, పలగాని కోటేశ్వరరావు, కొల్లి శేషిరెడ్డి, గుండాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నాలుగేళ్ల పాలన సువర్ణయుగం

**ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)**

**మంగళగిరి:** వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగేళ్ల పాలన రాష్ట్ర ప్రజలకు సువర్ణయుగమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) స్పష్టం చేశారు. మంగళవారం నగరంలోని ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడంతో రాష్ట్ర అభివృద్ధి సాధించడంలో విజయవంతమయ్యారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షే పథకాలను అమలు చేయడంతోపాటు విద్య, వైద్య రంగాలను బలోపేతం చేసి పేదలకు నాణ్యమైన విద్య, వైద్యాన్ని అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్కరూ సొంతిల్లు లేకుండా ఉండాలనే కృతనిశ్చయంతో అర్హులైన ప్రతి ఒక్కరికి సొంతిల్లు అందించడం రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు. వర్షాలు సకాలంలో కురవడంతో పాడి పంటలు సమృద్ధిగా ఉండడంతో రైతులతో అన్ని రంగాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో నాలుగు సంవత్సరాలలో గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.400 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టగా రూ.1200 కోట్ల సంక్షేమ పథకాలను ప్రజలకు అందివడం జరిగిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలన స్వర్ణయుగంలా కొనసాగగా ఇప్పుడు మరింత మెరుగ్గా సంక్షేమ పాలన కొనసాగుతుందన్నారు. ప్రజలలో ప్రభుత్వానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్న ఆదరణ చూసి తమకు రాజకీయంగా పుట్టగతులు ఉండవనే భయంతోనే దిగజారుడు విమర్శలు చేస్తున్నారని వారి విమర్శలను ప్రజలు పట్టించుకునే పరిస్థితి లేదని, 2024 ఎన్నికలలో తిరిగి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని స్పష్టం చేశారు.

### షార్ట్ సర్క్యూట్‌తో ఎలక్ట్రిక్ బైక్ దగ్ధం



**తాడికొండ:** ఎలక్ట్రిక్ బైక్ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఘటన తాడికొండలో జరిగింది. తాడికొండకు చెందిన ఆదిరెడ్డి సాంబిరెడ్డి విద్యుత్ బైక్‌ను అతని డెయిరీ ఫాంలో పనిచేస్తున్న ఉద్యోగి పాల ప్యాకెట్లు డెలివరీ చేసే ప్రక్రియలో భాగంగా తెల్లవారుజామున పడమర వీధి రామాలయం వద్ద నిలిపి వెళ్లాడు. ఇంతలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు అంటుకొని బైక్ పూర్తిగా దగ్ధమైందని బాధితుడు తెలిపాడు. వాహన కంపెనీ ప్రతినిధులకు సమాచారం అందించామని, తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

### రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

**తాడికొండ:** తాడికొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో బిక్కి మహేష్ బాబు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లతోపాటు మండల స్థాయి అధికారులు తమ తమ శాఖల ప్రగతి నివేదికలతో పాల్గొనాలని ఆయన తెలిపారు.

### బోరు పంపునకు మరమ్మతులు

**తాడేపల్లిరూరల్:** మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఎస్టీ కాలనీలో ఉన్న బోరు పంపు మరమ్మతులకు గురికావడంతో మంగళవారం కార్పొరేషన్ ఇంజినీరింగ్ సిబ్బంది మరమ్మతులు నిర్వహించారు. కాలనీలోని బోరుపంపు 10 సంవత్సరాల కిందట ఏర్పాటు చేసినది కావడంతో తుప్పు పట్టి నీళ్లు రావడం లేదు. ఉండవల్లి–1వ సచివాలయానికి చెందిన సిబ్బంది ఫిర్యాదు చేయడంతో వెంటనే మరమ్మతులు నిర్వహించినట్లు కార్పొరేషన్ సిబ్బంది తెలియజేశారు.

## చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే చేయూత



చిరువ్యాపారులకు ఇస్త్రీ బండ్లను అందజేస్తున్న బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి

**తాడేపల్లిరూరల్:** ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సహాయంతో తాడేపల్లిలో చిరువ్యాపారం చేసుకునే ఇద్దరికి ఇస్త్రీ బండ్లను మంగళవారం తాడేపల్లి వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి అందజేశారు. ముగ్గురోడ్డులో నివాసముంటున్న గజ్జలకొండ రాజేశ్వరి, మహానాడు ప్రాంతానికి చెందిన పజ్జూరి వీరమ్మలకు ఇస్త్రీ బండ్లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సెల్ ప్రధానకార్యదర్శి చిన్నపోతుల దుర్గారావు, తాడేపల్లి పట్టణ ఎస్సీ ఎస్టీ బీసీ కన్వీనర్లు ముదిగొండ ప్రకాష్, బాలసాని అనీల్, బత్తుల దాసు, సలాం, వాసు, జగదీష్, టి.వికాస్ తదితరులు పాల్గొన్నారు.

**మెల్లెంపూడిలో....**

మెల్లెంపూడి గ్రామంలో కేతావత్ రాత్రియా, షేక్ వలిలకు ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సహకారంతో మంగళవారం చిరు వ్యాపారులకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రాజారామిరెడ్డి ప్లాట్‌ఫాం రిక్షాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామకృష్ణారెడ్డి (నాని),శేఖర్, నాగులు, షేర్‌ఖాన్, అలాం బుడే, అనీల్‌రెడ్డి, బాష, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**మంగళగిరి:** ఆత్మకూరుకు చెందిన గొడవర్తి మరియదాసు, తిరుమలకొండ శ్రీనులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆర్థిక సాయంతో తోపుడు బండ్లను అందించారు. ఎమ్మెల్యే ఆర్కే అందజేసిన రెండు తోపుడు బండ్లను మంగళవారం స్థానిక పార్టీ నాయకులు బొమ్ము శివరామిరెడ్డి, గాలి సాంబశివరావుల చేతుల మీదుగా అందజేయగా వ్యాపారులు ఎమ్మెల్యే ఆర్కేకు ధన్యవాదాలు తెలిపారు.

## రాష్ట్రంలో 500 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు



మాట్లాడుతున్న నాబార్డు సీజీఎం గోపాల్

**ఫిరంగిపురం:** రాష్ట్రంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు 500 వరకు ఉన్నట్లు నాబార్డు సీజీఎం ఎం.ఆర్. గోపాల్ చెప్పారు. మండలంలోని నుదురుపాడులో సహజమిత్ర రైతు ఉత్పత్తిదారుల సంఘం పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల సమావేశం మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గోపాల్ మాట్లాడారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతానికి కృషి చేయనున్నట్లు వెల్లడించారు. మూడు జిల్లాల్లో నాబార్డు ఆర్థిక సహకారంతో వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. మూడు జిల్లాల్లో ఇప్పటివరకు 55 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు పనిచేస్తున్నట్లు వివరించారు. అనంతరం సంఘం కలెక్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. రైతులు పండించిన ఉత్పత్తులు, జూట్ బ్యాగులు, మహిళలు తయారు చేసిన మగ్గం అల్లికలను ప్రదర్శించారు. వీటిని గోపాల్ తిలకించారు. సమావేశంలో నాబార్డు డీజీఎం అరుణరాజన్, ఏజీఎం దీక్షాభూపేంద్ర, గుంటూరు డీజీఎం శరత్ బాబు, మిలాన్‌చౌహాన్ పాల్గొన్నారు.

### రాజన్న రచ్చబండ సేవా వాహనం ప్రారంభం



రాజన్న రచ్చబండ సేవా కార్యక్రమం వాహనాన్ని ప్రారంభిస్తున్న బాపట్ల ఎంపీ నందిగం సురేష్

**ఉద్దండరాయునిపాలెం(తాడికొండ):** రాజన్న రచ్చబండ సేవా కార్యక్రమంలో భాగంగా కొనుగోలు చేసిన మినీ వ్యానును బాపట్ల ఎంపీ నందిగం సురేష్ ప్రారంభించారు. ఆర్ అండ్‌ఆర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో అద్దంకి నియోజకవర్గం తోకలవారిపాలెం గ్రామానికి చెందిన గారె కోటి రాజన్న రచ్చబండ సేవా కార్యక్రమంలో భాగంగా వాహనాన్ని కొనుగోలు చేశాడు. మంగళవారం బాపట్ల ఎంపీ నందిగం సురేష్ చేతుల మీదుగా రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు.

## జగనన్నతోనే పేద ప్రజలకు భరోసా

**ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి**



కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి తదితరులు

**తాడేపల్లిరూరల్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పేద ప్రజలకు భరోసా లభించిందని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి అన్నారు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగు వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రపంచం మొత్తం కరోనా మహమ్మారి ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసిందని, అలాంటి సమయంలో కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల కోసం నవరత్నాల్లో పొందుపరిచిన మ్యానిఫెస్టోను అమలు చేస్తూ పరిపాలన సాగించారని, కరోనా సమయంలో సైతం పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేసి వారికి ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఆదుకున్నారని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దుగ్గిరాలలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని, సొంత ఇల్లు లేని వారు ఒక్కరు కూడా ఉండకూడదని అక్కా చెల్లెమ్మల పేరు మీద స్థలాలు కేటాయించి ఇళ్లు కట్టుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆర్థిక సహాయం అందించడమే కాకుండా ఇంటి నిర్మాణానికి అవసరమైన ముడి సరుకును కూడా సబ్సిడీపై అందజేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పెత్తందారులకు పేదలకు మధ్య పోరాటం జరుగుతోందని, 2024లో సైతం పేదలు జగన్‌మోహన్‌రెడ్డి పక్కన నిలబడి ముఖ్యమంత్రిని చేస్తారని ఆమె అన్నారు. ఎంపీటీసీ సభ్యుడు కూచిపూడి సురేష్, వైఎస్సార్‌సీపీ దుగ్గిరాల మైనార్టీ సెల్ నాయకులు సుభానీ, సర్పంచ్ ఇత్తడి రమేష్, మాజీ ఎంపీపీ వడ్డేశ్వరం రజనీకాంత్, వైఎస్సార్‌సీపీ జిల్లా బిసిసెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్), వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు శిక్షణ

**గుంటూరు ఎడ్యుకేషన్:** ఏసీ కళాశాల వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా నర్సింగ్ విద్యార్థిని డి. పల్లవి క్రీడాంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం సమాజంలో మెలిగే అంశాలపై వివరించారు. గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

### ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలకు పరిష్కారం

**పాత గుంటూరు:** ఆర్టీసీ గుంటూరు– 2 డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల్ని పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని మేనేజరు షేక్ అబ్దుల్ సలాం తెలిపారు. డిపో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు, సమస్యల్ని తెలుసుకున్నారు.

- గుంటూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సులకు మంగళగిరి స్టేజి ఏర్పాటు చేయాలని ఆ పట్టణానికి చెందిన.సాంబశివరావు కోరారు.
- మణిపురం బ్రిడ్జి వద్ద విజయవాడ వెళ్లే బస్సులు ఆపడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, దాన్ని కంట్రోల్ చేయమని గుంటూరుకు చెందిన శంకర్ కోరారు.
- గుంటూరు నుంచి విశాఖపట్నం, హైదరాబాద్‌కు ఏసీ స్లీపర్ బస్సులు ఏర్పాటు చేయాలని పాత గుంటూరుకు చెందిన కిశోర్ కోరారు.
- గుంటూరు నుంచి ఉదయగిరికి వయా ఒంగోలు, కందుకూరు, వింజమూరు మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని గుంటూరుకు చెందిన వీరవల్లి బ్రహ్మయ్య కోరారు.

### బాలిక అదృశ్యం

**పెదకాకాని:** మండలంలోని సగరపాలేనికి చెందిన ఎనిమిదో తరగతి చదువుతున్న బాలిక ఈనెల 24న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుమార్తె అదృశ్యంపై కలత చెందిన తండ్రి మనస్తాపంతో ఈనెల 29న పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అదృశ్యమైన బాలిక ఆచూకీ కోసం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి

- జగనన్న నాలుగేళ్ల పాలన పూర్తి సందర్భంగా సంబరాలు
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త సురేష్‌కుమార్



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కత్తెర సురేష్‌కుమార్, బత్తుల బ్రహ్మానందరెడ్డి

**తాడికొండ:** జగనన్న నాలుగేళ్ల సంక్షేమ పాలనలో కులం, మతం, ప్రాంతం, పార్టీలకతీతంగా ప్రతి కుటుంబానికి రూ.లక్షల్లో లబ్ధి చేకూరిందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 4 సంవత్సరాల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా గుంటూరు భారత్‌పేటలోని తాడికొండ నియోజకవర్గ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. కార్యాలయంలో అభిమానులు, కార్యకర్తల సందడి నడుమ కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ 4 సంవత్సరాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందించారనేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికి వెళుతున్న మాకు వస్తున్న ప్రజాదరణే నిదర్శనమన్నారు. 75 సంవత్సరాల భారతదేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని సాహసోపేతమైన నిర్ణయంతో రాష్ట్రంలో 31 లక్షలు, రాజధానిలో 50,700 ఇళ్ల పట్టాలు అందజేసిన జగనన్న పాలనలో ప్రతి పేదవాడికి నీడ దొరికిందనడంలో సందేహం లేదన్నారు. పేదలకు ఆర్థిక పరిపుష్టి లేకుండా చేయాలని కోర్టుల్లో తప్పుడు కేసులు వేసిన చంద్రబాబు అండ్ కో కుట్రలను తేటతెల్లం చేసేందుకు హైకోర్టుతోపాటు సుప్రీంకోర్టుకు కూడా వెళ్లి న్యాయబద్ధమైన ప్రభుత్వ నిర్ణయాన్ని గెలిపించి పేదలకు కానుకగా అందించిన జగనన్నకు దేశ వ్యాప్తంగా ఆదరణ మరింతగా పెరిగిందన్నారు. రాజధానిలో ఇళ్ల పట్టాలు తీసుకున్న లబ్ధిదారుల్లో ఉన్న టీడీపీ, జనసేనకు చెందిన కార్యకర్తలమేనని ఒప్పుకోవడం జగనన్న ఉత్తమ పాలనకు నిదర్శనమన్నారు. పేదల సంక్షేమమే అజెండాగా రాష్ట్రంలో సుస్థిర పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజల మద్దతు మరింతగా పెరిగిందని అన్నారు. కార్యక్రమంలో పలువురు మండల స్థాయి ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## బానిసత్వం నుంచి మమ్మల్ని కాపాడండి



పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించిన గిరిజనులు

**మేడికొండూరు:** కాలం మారుతున్నా బానిసత్వ బతుకులు మారడం లేదని గిరిజన యానాదుల సంక్షేమ సంఘం నాయకులు కొమరగిరి సూర్యబాబు, తుపాకుల ఉమామహేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు అన్నారు. మేడికొండూరు పోలీసుస్టేషన్ సీఐ వాసును కలసి సమస్యను వివరించారు. మేడికొండూరు మండలం విశదల గ్రామానికి చెందిన గంజి బుచ్చయ్య గ్రామాల్లో యానాదుల్లో నిరుపేదలను ఆసరాగా చేసుకుని వారికి మందు, డబ్బు ఆశ చూపించి, వారిని కూలి పనులకు తీసుకెళ్లి వెట్టి చాకిరి చేయిస్తున్నాడని తెలిపారు. మంగళవారం తిరుపతమ్మ, సువార్త, ఆదిలక్ష్మి, మరికొందరు మహిళలను బుచ్చయ్య చిత్రహింసలు పెడుతుండటంతో భయపడిన మహిళలు తప్పించుకుని తమ కాలనీకి వచ్చి గ్రామంలోని కొందరికి జరిగిన విషయం చెప్పారన్నారు. వారి సహకారంతో పోలీసుస్టేషన్‌కు వచ్చినట్లు తెలిపారు. చదువురాని వారికి ప్రామిసరీ నోటుపై తక్కువ డబ్బులు ఇచ్చి ఎక్కువ డబ్బులు ఇచ్చినట్లు రాసేవాడని చెప్పారు. ఈవిషయమై ప్రశ్నిస్తే మందు తాగి ఉన్నాడని, అతను తీసుకున్న ప్రామిసరీ నోటు కోర్టులో వేసి మీ కుటుంబాన్ని జైలులో పెట్టిస్తానని బెదిరిస్తున్నాడని సీఐ వాసుకు వివరించారు. సీఐ వాసు బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని చెప్పడంతో వారు అక్కడి నుండి వెళ్లిపోయారు.

## ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించిన కాలిఫోర్నియా యువతి



పొలంలో వివరాలు తెలుసుకుంటున్న కాలిఫోర్నియాకు చెందిన ఎలెక్సా రూసా

**మంగళగిరి:** నగర పరిధిలోని పెదవడ్లపూడిలో సాగవుతున్న ప్రకృతి వ్యవసాయ పంటల్ని మంగళవారం కాలిఫోర్నియా స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో విద్యనభ్యసించిన ఎలెక్సా రూసా పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం గురించి తెలుసుకున్నారు. జీవామృతం తయారీ, అవి పంటలకు వినియోగించే విధానాలపై రైతుల్ని అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాల్ని డీపీఎం జానకమ్మ వివరించారు. ఐదు రకాల పంటల్ని పండిస్తున్న వి.వెంకటేశ్వరరావు నిమ్మ తోటతో పాటు ప్రకృతి వ్యవసాయంలో నిమ్మలో అంతర పంటల్ని సాగు చేస్తున్న వి. జగన్మోహన్‌రావు పొలాల్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఐసీటీ వెంకటరమణారెడ్డి, అధికారులు శ్యాంబాబు, రాయల్‌రావు, లక్ష్మణరావు, జోజమ్మ, ఆనంద్‌బాబు, భీష్మ ప్రతాప్ పాల్గొన్నారు.

## జగనన్న సంక్షేమ పాలనకు నాలుగేళ్లు

- ఎంపీ నందిగం సురేష్
- ఉద్దండ్రాయునిపాలెంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీ నందిగం సురేష్, నేతలు

**తాడికొండ:** రాష్ట్ర చరిత్రను తిరగరాస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు నేటితో నాలుగేళ్లు విజయవంతంగా పూర్తి చేసుకుందని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అన్నారు. తుళ్లూరు మండలం ఉద్దండ్రాయునిపాలెం తన నివాసంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పాలన అందిస్తున్న జగనన్న రాష్ట్రంలో మరో 50 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.